క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని ఆపరేషన్ నిమిత్తం బోధన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. 12 మందికి కంటి అద్దాలను సిఫారసు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, సభ్యులు శేఖర్, సంతోష్, రాము, వైద్యులు సమద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్యాంప్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగ విద్యార్థుల కోసం ఎంఈవో దేవిసింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌లో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 9 మంది వికలాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇంటి వద్ద చేయించే వ్యాయామాల గురించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు కమల్ కిషోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..



రాజంపేట: మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించారు. మండల విద్యాధికారి రామస్వామి సందర్శించి దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. డాక్టర్ నవీన్ సాయి చెప్పినట్లు వ్యాయామం చేయించాలని సూచించారు. ఐఆర్పీలు ఎం మహేశ్వరి, ఎం అశోక్ కుమార్, ఎంఐఎస్ భాగ్య పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళులు

కామారెడ్డి టౌన్: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు మాదిగ అమరవీరులకు శుక్రవారం నివాళులర్పించారు.ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేసిన అమవీరుల ఆశయాల కోసం వర్గీకరణ బిల్లు అమలు చేయాలని జిల్లా అధ్యక్షులు సత్తిగారి లక్ష్మి డిమాండ్ చేశారు. వెంకట్ రాములు, యాదగిరి, లత పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



రామారెడ్డి: వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రామారెడ్డి ఎంపీడీవో సవిత ఆదేశించారు. శుక్రవారం జగదంబ తండాలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో మొక్కలకు పోశారు. ఉపాధి హామీ వర్క్ సైట్, నర్సరీలను సందర్శించారు. ఏపీవో ధర్మారెడ్డి, కార్యదర్శి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. మంగళవారం నాటికి 3 లక్షల 20వేల 587 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావ్ తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి):వజ్జపల్లిలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు గాదె చిన్నన్న, గంగాధర్, కమలాకర్ రావు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు టెట్‌లో అర్హత మార్కులు తగ్గించాలి

భిక్కనూరు: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ముందుగా నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు అర్హులైన అగ్రవర్ణ పేదలకు బీసీ అభ్యర్థుల మాదిరిగా అర్హత మార్కులు తగ్గించాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర కో–ఆర్డినేటర్ నాగర్తి చంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే పోటీ పరీక్షల్లో అర్హత సాధించాలంటే టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అర్హులైన ఓసీ పేద విద్యార్థులకు న్యాయం చేసేలా చూడాలన్నారు.

‘నాగమడుగు’ కేసీఆర్‌కు మినీ ఏటీఎం

- స్వార్థ ప్రయోజనాల కోసమే ఎత్తిపోతల పథకం
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నాగమడుగు ఎత్తిపోతల పనులను పరిశీలిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా చేసిన మోసాలకు ఇంకొక్క గొప్ప ఉదాహరణ నాగమడుగు లిప్టు ఇరిగేషన్ ప్రాజెక్టు అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. నాగమడుగు ఎత్తిపోతల నిర్మాణ పనుల్లో విస్తు పోయే నిజాలు ఎన్నో బయటపడ్డాయన్నారు. శుక్రవారం ఒడ్డేపల్లి శివారులో మంజీరా నదిపై నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పనులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరిశీలించారు. నాగమడుగు ఎత్తిపోతలతో 300 ఎకరాల భూములు పోతున్నాయని కరకట్ట ద్వారా పంట పొలాలు నీటమునుగుతాయని రైతులు వినతిపత్రం ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రాణాన్ని తాకట్టు పెట్టి దరిద్రమైన మేడిగడ్డ ప్రాజెక్టు కట్టారన్నారు. రాజకీయ ఎత్తుగడలు, కేసీఆర్ పెద్దరికం కోసం ప్రాజెక్టు కట్టి అవినితి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే మినీ ఏటీఎంలా ఉపయోగించుకున్నారని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి లిప్టును ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో నాన్ కమాండ్ ఏరియాకు సాగు నీరు అందించాలన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి లిప్టును ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరుతానని చెప్పారు. నిజాంసాగర్ ప్రాజెక్టు జుక్కల్ నియోజకవర్గంలో ఉన్నా 4,500 ఎకరాలకు మాత్రం సాగునీరు అందుతుందన్నారు. నాయకులు జయప్రదీప్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మిస్తాం

సొంతిళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి తీరుతానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు.శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడం ప్రజాప్రతినిధుల కర్తవ్యమన్నారు. దళితులకు రావాల్సిన పథకాలు, డబ్బులు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 2014 నుంచి 2024 వరకు రూ.40 వేల కోట్లు ప్రాజెక్టులకు మళ్లించారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో యువకుల చేరిక



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నామని యువకులు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆకాష్ నాయకులు తోట రాజు తదితరులున్నారు.

17 స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయం

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాలూ బీజేపీ గెలుపొందడం ఖాయమని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలో పెద్దవాగు నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధాన మంత్రిగా గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మోదీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ విజయ సంకల్ప యాత్ర ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షులు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, బాపురెడ్డి, పైడి ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్

టీటీడీలో కామారెడ్డి ఎమ్మెల్యే పూజలు

బాన్సువాడ: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానాన్ని శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ బీర్కూర మండల ఇన్‌చార్జి సాయికిరణ్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన విజయ సంకల్పయాత్రలో పాల్గొన్నారు.

సంకల్పయాత్రకు ఘన స్వాగతం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రకు సదాశివనగర్‌లో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో 17 సీట్లను సాధించడమే ధ్యేయంగా చేపట్టిన ఈ యాత్రను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ యాత్ర సదాశివనగర్ తర్వాత రామారెడ్డి మండలానికి చేరుకుంటుందని బీజేపీ నాయకులు తెలిపారు. నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జైపాల్ రెడ్డి, సంతోష్ పాటిల్, మోహన్ రాజ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతలకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సెల్‌టవర్ ఏర్పాటుపై విచారణ



గోలిలింగాలలో గ్రామస్తుల సమక్షంలో విచారణ చేస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోలిలింగాల శివారులో ఎయిర్‌టెల్ సెల్‌టవర్ ఏర్పాటుపై శుక్రవారం స్థానిక ఎంపీవో శ్రీనివాస్ విచారణ జరిపారు. తమ గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దని కోరుతూ ఇటీవల గ్రామస్తులు కామారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలకు దగ్గరలో సెల్‌టవర్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు రేడియేషన్ ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఎంపీవోతో చెప్పారు. దీంతోపాటు ఇటీవల గ్రామంలో చాలా మంది బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్‌ఎటాక్‌కు గురయ్యారని వారు చెప్పారు. ఇదివరకే గ్రామంలో ఉన్న జియో టవర్ ప్రభావంతో గ్రామంలో చాలా కోళ్లు మృత్యువాత పడ్డాయని, తమ గ్రామానికి కిలోమీటర దూరంలోనే ఎయిర్‌టెల్ టవర్ ఉందని, దీనివల్ల ప్రస్తుతం గ్రామంలో సెల్‌సిగ్నల్స్ బాగానే వస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దని, టవర్ ఏర్పాటు పనులు చేపడితే తాము రోడ్డెక్కి ఆందోళన చేస్తామని వారు పేర్కొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి

బాన్సువాడ రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోర్లం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు మంజూరైన గుడ్లు, పాలు, పప్పు, నూనె, బియ్యం తదితర సరుకుల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్ మన్నె పద్మ, నాయకులు జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మన్నె విఠల్, అహ్మద్, మన్నె గంగారాం, మంద భూమేష్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభం



భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో రామస్వామి

రాజంపేట: ఆర్గొండ ప్రాథమిక పాఠశాలలో 9 నెలల క్రితం నిలిచిపోయిన మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఎంఈవో రామస్వామి పునః ప్రారంభించారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన మధ్యాహ్న భోజన పథకం ఆవశ్యకతను గుర్తించి మళ్లీ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సహకరించిన ఐకేపీ సాయిలును అభినందించారు. బస్వన్నపల్లి గ్రామ పాఠశాలలో సైతం రేపటి మధ్యాహ్న భోజనం పునః ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, పూర్ణ చందర్ రావ్, సీఆర్‌పీ సాయి రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బాన్సువాడ రూరల్: దేశాయిపేట్ జెడ్పీ హైస్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరు బ్యాంకుల సేవలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ బాన్సువాడ బ్రాంచ్ మేనేజర్ సంజీవ్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు ఎర్వాల రామక్రిష్ణారెడ్డి, అంజయ్య, సతీష్‌కుమార్, నరేందర్, సుంక్య పాల్గొన్నారు.

సమాచారం..

14న కామారెడ్డిలో సామూహిక పుత్రకామేష్టి యాగం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పడమర హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీసంకష్టహర మహాగణపతి ఆలయంలో ఈనెల 14న సామూహిక పుత్ర గణపతి వ్రత సహిత పుత్రకామేష్టి మహాయగం నిర్వహిస్తున్నట్టు వేదపండితులు గంగవరం అంజనేయశర్మ తెలిపారు. ఈ యాగంలో పండితులు శివంపేట శ్రీబగలాముఖి శక్తిపీఠం వ్యవస్థాపకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ పాల్గొంటారన్నారు. యాగంలో పాల్గొనే సంతానం లేని దంపతులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, 8885299917 నంబర్‌కు వాట్సప్ ద్వారా సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్ గ్రామంలో ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దుబ్బాక మఠాధిపతి మఠం సిద్ధిరాములు ఆధ్వర్యంలో దక్షయజ్ఞ ప్రవేశం(అగ్ని గుండములు)ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం చేపట్టారు. వేడుకలకు వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథాన్ని వివిధ రంగుల పూలతో చూడముచ్చటగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దొడ్లె రవి, మాజీ సర్పంచ్ మోతె సాయవ్వ, ఎంపీటీసీ రాంచందర్ రావు, విండో చైర్మన్ ప్రభాకర్ రావు, ఉప సర్పంచ్ శివపాటిల్, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయం ..



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి):మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి,పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన



స్కూల్‌తండాలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



లచ్చాపేట పాఠశాలలో ..

సాక్షి నెట్‌వర్క్:కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా, ఓటర్లుగా మారారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరించారు. ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, మంచి నేతను ఎన్నుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు సూచించారు.



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో..



సంఘమేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..



బిచ్కుంద డిగ్రీ కళాశాలలో క్యూలో నిల్చున్న విద్యార్థినులు



మర్కల్ గురుకుల మహిళ కళాశాలలో ..

పింఛన్‌దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి




పింఛన్‌దారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ

దోమకొండ: ప్రభుత్వం ప్రతినెలా పంపిణీ చేస్తున్న పింఛన్ డబ్బులను సకాలంలో అందజేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉమాబాగ్‌లో పింఛన్‌దారులు, పోస్టాఫీస్ సిబ్బందితో మాట్లాడారు. దోమకొండలో 3,351 మందికి, మండలంలో 7,496 మందికి పింఛన్ అందుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. తాగునీటి ఎద్దడి ఏర్పడే గ్రామాల్లో ముందుస్తుగా బోర్లకు మరమ్మతులు చేపట్టాలని, దీంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.



సరైన ధ్రువపత్రాలు లేకపోతే జరిమానా తప్పదు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా తప్పదని ఎస్సై కోనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపినా..హెల్మెట్ ధరించకపోయినా జరిమానా విధిస్తామన్నారు. పలువురు వాహనదారులను పోలీస్ స్టేషన్‌కు తరలించి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది వెంకట్,అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన

బాన్సువాడ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరారు. పర్యటనలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, బ్యారేజీలను పరిశీలించారు.

ధరణి సమస్యలు పరిష్కరిస్తున్నాం

బిచ్కుంద(జుక్కల్): ధరణి ద్వారా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పెండింగ్‌లో ఉన్న 75 దరఖాస్తులు పరిశీలిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులన్నీ పరిశీలించి ధరణి పోర్టల్‌లో మార్పులు చేర్పులు చేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

భిక్కనూరులో గృహజ్యోతి ప్రారంభం

భిక్కనూరు: మండల కేంద్రంలో శుక్రవారం గృహజ్యోతి పథకాన్ని అధికారులు అమలు చేశారు. జీరో కరెంట్ బిల్లులను వినియోగదారులకు అందజేశారు. ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, సుదర్శన్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఉత్తమ రైతుగా కొత్తపల్లివాసి



మాచారెడ్డి:జాతీయ పురుగు మందులు, తెగులు నివారణ సంస్థ ద్వారా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి ఉత్తమ రైతుగా ఎంపికయ్యారు. శ్రీకాంత్ మాట్లాడుతూ..తనను ఉత్తమ రైతుగా ఎంపిక చేసిన ఆ సంస్థకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ రైతుగా ఎంపికైన శ్రీకాంత్ రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

చింతల పోశవ్వకు ‘సబల–సత్యభామ’ అవార్డు

కామారెడ్డి అర్బన్: పర్యావరణహిత ఉత్పత్తులు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న కామారెడ్డికి చెందిన దివ్య హస్తం ట్రస్ట్ వ్యవస్థాపకులు, దివ్యంగురాలు చింతల పోశవ్వను హైదరాబాద్ గోనె వెంకటేశ్వర్ సేవా సంస్థ ‘సబల–సత్యభామ’ పేరుతో అవార్డు ఇచ్చి సన్మానించింది. సేవ్ ఎన్విరాన్‌మెంట్ వర్క్‌లో భాగంగా కొడంగ్ ఆర్గానిక్ ఉత్పత్తులకు గాను చింతల పోశవ్వను ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక, ఆధ్యాత్మిక, ప్రవచన వేత్త డాక్టర్ అనంతలక్ష్మి చేతుల మీదుగా సబల –సత్యభామ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా పలువురు పోశవ్వను అభినందించారు.

గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రిష్ణాజీవాడిలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబూజగ్జీవన్‌రావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన గ్రామపటం, మ్యాట్రిక్స్, ర్యాంకింగ్, సమయధోరిణి, సమస్యల చెట్టు, చపాతిపటం, వ్యవసాయ కాలచక్రం, టైమ్‌లైన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. స్థానిక ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.